క్లుప్తంగా...

గులాబీ జెండాను ఎగరవేస్తాం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్ని వర్గాల దీవేనలతో గులాబీ జెండా ఎగరవేస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆమె బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ఆధ్వర్యంలో ఆరవ వార్డు ఎల్‌ఐసీ కాలనీ, బ్యాంకు కాలనీ, సిఖ్‌విలేజ్, మస్తానా హోటల్ చౌరస్తా, కుమ్మరిగుట్ట, తాడ్‌బంద్, ప్రాంతాల్లో పర్యటిస్తూ మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గత పదేళ్లుగా పేద ప్రజల కోసం సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆధ్వర్యంలో ఆరవ వార్డు పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. ఆమె వెంట ఖదీరవన్, దీనానాథ్ యాదవ్, భాస్కర్ రెడ్డి, జయరామ్, యశ్వంత్, నరహరి, చిన్నిక్రిష్ణ, హేమలత, సాయిచరణ్, రాజు ఉన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే’

సనత్‌నగర్: బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఆమె బైక్ ర్యాలీ నిర్వహించారు. మోండా డివిజన్ పాలికాబజార్ నుంచి మొదలైన ర్యాలీ బైబిల్‌హౌస్ చౌరస్తా, సింధికాలనీ, బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, బల్కంపేట ఎల్లమ్మగుడి, సనత్‌నగర్, అల్లావుద్దీన్ కోఠి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేసే పార్టీ కాంగ్రెస్సే అన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన అడ్డగుట్ట డివిజన్‌లోని లోహియానగర్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 70 ఏళ్ల తర్వాత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి మొదటి సారి స్థానికుడికి టికెట్ లభించడం పట్ల సికింద్రాబాద్ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ల అధికారంలో ఉన్న పద్మారావుగౌడ్ నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక ప్రజల సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. అడ్డగుట్టలో తాగునీటి కష్టాలు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ సమస్యలు, అధ్వానమైన రోడ్లతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. 50 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఆస్పత్రిని నిర్మాణ విషయాన్ని గాలికి వదిలేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల ముందు హడావుడి చేయడానికి ముప్పై పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి నేతృత్వంలో ఆదివారం తుకారాంగేట్, గడ్డమీది బస్తీ, శాంతినగర్, వెంకట్‌నగర్‌లోని మహిళలు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనకు ప్రజలందరూ ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో రమాదేవి, పద్మ, సద్గుణ, భారతమ్మ, ఎల్లమ్మ, ఖాజాలతో పాటు సుమారు 100 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, ఎల్లయ్య, వసంత, మహ్మద్, దేవయ్య పాల్గొన్నారు.

నవగ్రహ ఆలయం.. దసరా వేడుకలకు సిద్ధం

- ముస్తాబైన చారిత్రాత్మక హనుమాన్ దేవాలయం
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు





బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ కర్బలామైదాన్ ఆర్పీ రోడ్డు జీరాలోని చరిత్రాత్మక నవగ్రహ హనుమాన్ దేవాలయం దసరా వేడుకల కోసం ముస్తాబైయింది. ఈ నెల 24 (మంగళవారం) జరిగే దసరా పండుగ కోసం దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు దసరా పండుగ రోజు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దసరా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వి. లావణ్య, ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ ఉదయ్ సింగ్ చెప్పారు.

ఆలయ చరిత్ర..

నవగ్రహ హనుమాన్ దేవాలయానికి చారిత్రాత్మకమైన నేపథ్యం ఉంది. నాటి పరిస్థితుల్లో హిందువులను సమీకరించి సంఘటితం చేయడానికి స్థానిక వ్యాపారి మోహన్‌సింగ్ 1912లో తన స్థలంలో హనుమాన్ దేవాలయాన్ని నిర్మించి అభివృద్ధి చేశారు. సికింద్రాబాద్ ఏరియాలో నవగ్రహ హనుమాన్ దేవాలయానికి ఎంతో ప్రసిద్ధిగాంచింది. సుమారు 113 ఏళ్ల నుంచి సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడే దసరా వేడుకలు చేస్తుంటారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఇప్పటికీ ఈ దేవాలయాన్ని వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. చారిత్రాత్మకమైన దేవాలయం కావడంతో బన్సీలాల్‌పేట్, బోయిగూడ, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ, ఆర్పీ రోడ్డు, హైదర్‌బస్తీ, జీరా, భోలక్‌పూర్, గాంధీనగర్, తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు దేవాలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. దసరా రోజు ప్రజల సందడితో దేవాలయం పరిసరాలు కోలాహలంగా ఉంటాయి. ఎక్కడ చూసినా జన సందోహంతో పరిసరాలు కిక్కిరిసిపోతాయి.

సర్వం సిద్ధం..



దసరా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేశాం. ఆలయ పరిసరాలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దాం. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం. –లావణ్య, ఈవో

డబ్బులు పంచుతున్న వ్యక్తిపై కేసు

కంటోన్మెంట్: ఓటర్లకు డబ్బు పంచుతున్న కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. తాడ్‌బంద్ హనుమాన్ టెంపుల్ సమీపంలో డబ్బులు పంచుతున్నట్లు పోలీసులకు సమాచారంతోఎం. నిఖిలేష్ నేతృత్వంలోని ఎఫ్ఎస్‌టీ–5 బృందం, ఎస్ఐ నాగేంద్రబాబు అక్కడికి చేరుకుని ఎం. భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి ఓటర్లకు డబ్బులు పంచుతున్న దృశ్యాలను వీడియోలో చిత్రీకరించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.59,900 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

‘హునార్ మహోత్సవ్’కు స్పందన



రసూల్‌పురా: జింఖానా మైదానంలో కొనసాగుతున్న హునార్ మహోత్సవ్ ఎగ్జిబిషన్‌కు స్పందన లభిస్తోంది. వివిధ రాష్ట్రాల హస్త కళాకారులు రూపొందించిన కళాత్మక వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాళ్లలో అరుదైన కళాఖండాలు, జ్యూట్. కలంకారీ, బనారాస్, కశ్మీరి సిల్క్, కాటన్, బెంగాలీ శారీస్, ఆకర్షిస్తున్నాయి.

ఊరెళ్లేవారు సమాచారం ఇవ్వాలి



బౌద్ధనగర్: దసరా సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో డబ్బులు, నగలు వెంట తీసుకెళ్లే వారు సంబంధిత పత్రాలు కూడా తీసుకెళ్లాలని సూచించారు.

సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాం

సనత్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నియోజకవర్గ ప్రజలు సమస్యలతో సతమతమయ్యేవారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రిగా ఎన్నికైన మర్రి చెన్నారెడ్డి కూడా చేయలేని అభివృద్ధి పనులను తొమ్మిదిన్నర ఏళ్లలో పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్, ఖలీల్‌బేగ్, నోమాన్, సమీర్, సరాఫ్ సంతోష్, సురేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, పుష్పలత పాల్గొన్నారు.

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు స్థానిక ఎంఐఎం నేతలు మద్దతు తెలిపారు. తలసాని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఎంఐఎం నాయకులు షౌకత్, జావీద్, షుకూర్‌ల ఆధ్వర్యంలో ప్రచారంలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని అశోక్‌కాలనీ, డీఎస్ఎంకాలనీలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అశోక్‌కాలనీలో మతీన్, జాకీర్, అబ్రార్, రాజు, ఖలీల్‌బేగ్, జమీర్‌ల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



ప్రచారంలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సీనియర్ సిటిజన్స్ సైతం..

- సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు చెందిన సీనియర్ సిటిజన్స్ తాము సైతం అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రచారంలో పాల్గొన్నారు. పార్థసారధి, రామమూర్తి, కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, కృష్ణదేవ్‌గౌడ్, విఠల్‌రెడ్డి, ప్రసాద్, వీరారెడ్డి మంత్రికి మద్దతు తెలిపారు.

బ్రిడ్జి పైనుంచి పడి మహిళ మృతి

అడ్డగుట్ట: బ్రిడ్జి పైనుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మాజీద్ వివరాల ప్రకారం.. ఈ నెల 21న రాత్రి 7 గంటల సమయంలో సుమారు 50–55 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని మహిళ జేమ్స్ స్ట్రీట్ సమీపంలోని పట్టాలపై ఉన్న బ్రిడ్జి పై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

డబ్బు కోసం నాన్నమ్మను హత్య చేసిన మనవడు

- కిందపడి చనిపోయిందని నమ్మించే యత్నం
- నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ జట్టు భాస్కర్, చిత్రంలో నిందితుడు సాబేర్

సనత్‌నగర్: దురాలవాట్లకు బానిసైన ఓ యువకుడు తనకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో నాన్నమ్మను హతమార్చిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం ఇన్‌స్పెక్టర్ జట్టు భాస్కర్ ఎస్ఐ జయచందర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. బేగంపేట పాటిగడ్డ సమీపంలోని వికార్‌నగర్ కట్టెలమండి ప్రాంతంలో ఆరిఫాబేగం (68) నివాసముంటోంది. ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆమె భర్త షేక్ హమీద్ గతేడాది మృతి చెందగా ఆయన పింఛన్‌తో కాలం వెళ్లదీస్తోంది. ఆరీఫాబేగం మనమడు మోసిన్‌ఖాన్ (కూతురు కొడుకు) ఆమె ఇంటికి సమీపంలోనే ఉంటుండగా చిలకలగూడ ప్రాంతంలో ఉండే మరో మనమడు షేక్ సాబేర్ (కుమారుడు షేక్ హబీబ్ కొడుకు) వ్యసనాలకు అలవాటుపడి తరచూ నాన్నమ్మ వద్దకు వచ్చి డబ్బులు తీసుకుని వెళ్తుండేవాడు. ఈ నెల 14న తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఆరిఫాబేగం ఇంటికి వచ్చిన సాబేర్ డబ్బులు అడగగా ఇవ్వనని చెప్పడంతో బలవంతంగా బీరువాలో నుంచి రూ.5 వేలు తీసుకున్నాడు. అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఆమెను గట్టిగా తోసేయడంతో కిందపడిపోయింది. అనంతరం ఆమె ముక్కును గుడ్డతో అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు.

గుర్తుపట్టకుండా గుండు గీయించుకుని..

ఆరిఫాబేగంను హత్య చేసిన అనంతరం నాన్నమ్మ ఆమె తన ఇంట్లో కిందపడిపోయి ఉందంటూ మోసిన్‌ఖాన్‌కు షేక్ సాబేర్ ఫోన్ చేసి తెలిపాడు. దీంతో మోసిన్‌ఖాన్‌తో పాటు బంధువులు హుటాహుటిన వెళ్లి చూడగా ఆమె అపస్మారక స్థితిలో కిందపడిపోయి ఉంది. షేక్‌సాబేర్ చెప్పే మాటల్లో పొంతన లేకపోవడంతో గట్టిగా నిలదీయగా అక్కడి నుంచి పరారయ్యాడు. అతనిపై అనుమానంతో మోసిన్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాబేర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తన మొబైల్ సిమ్‌కార్డును తీసేసిన సాబేర్ నాంపల్లిలో రైలెక్కి అజ్మీర్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు గుండు చేయించుకుని తిరిగి చిలకలగూడలో ఉండే ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి వద్ద నిఘా ఉంచిన పోలీసుల బృందం అదుపులోకి తీసుకుని విచారించగా నాన్నమ్మను హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంబరం.. బతుకమ్మ సంబురం

సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాన్నాయి. మహిళలు, యువతులు, మహిళలు తీరొక్క పువ్వులతో అందంగా బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం



బతుకమ్మ వేడుకలో మంత్రి తలసాని



జెక్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు




అమీర్‌పేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బీకేగూడలో యువతుల సందడి



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్













సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379